మహాత్మా..! మన్నించు..!!

మహాత్మా.. మమ్మల్ని మన్నించండి..!
మీరు మాలో నింపిన చైతన్యం.. నిర్వీర్యమైంది,
మీరు మాలో రగిలించిన ఉద్యమ జ్వాల.. ఆరిపోయింది.

- - - -

సరిగ్గా 420 రోజుల క్రితం..
మా ఓట్లతో గద్దెనెక్కినోళ్లు..
వాటినే ఇంకా లెక్కెట్టుకుంటున్నారేమో..
మరో నాలుగేళ్లుందని మురిసిపోతున్నారేమో..
ప్రజాసేవకు తొందరేముందని అనుకుంటున్నారేమో..
అందుకే, హామీలన్నీ గాలికొదిలేసి
'420' నేరగాళ్లుగా మారినట్టున్నారేమో..!

- - - -

వంచకుల పంచన చేరవద్దని..
అక్రమార్కులను అక్కున చేర్చుకోవద్దని..
బానిసత్వాన్ని భరించవద్దని..
ఆనాడు మీరు చేసిన బోధనలన్నీ మర్చిపోయాం..
ఈనాడు మేము అవన్నీ గుర్తుచేసుకుంటున్నాం..

- - - -

మహాత్మా..
నిర్వీర్యమైన చైతన్యాన్ని పునరుజ్జీవింపజేస్తాం..!
ఆరిపోయిన ఉద్యమ జ్వాలను తిరిగి రగిలిస్తాం..!!
మీ ప్రతిమ సాక్షిగా ప్రతిన బూనుతున్నాం..!!!

ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు 420 రోజులు పూర్తయింది. వీటిని అమలును గాలికొదిలేసిన కాంగ్రెస్ పాలకులు ఇప్పుడు ప్రజాకోర్టులో '420' నేరగాళ్లుగా (మోసగించిన వాళ్లపై పోలీసులు 420 కేసు న మోదు చేస్తారు) మిగలారు. గాంధీ వారసులమని చెప్పుకుంటూ, ఆ మహాత్ముడి ప్రతిష్టకే మచ్చ తెచ్చేలా వ్యవహరిస్తున్నారంటూ.. ఆ జాతిపిత వర్ధంతి రోజైన గురువారం.. ఆయన ప్రతిమకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శ్రేణులు, ప్రజలు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పాలకులకు బుద్ధిని ప్రసాదించాలంటూ వినతిపత్రాలు సమర్పించారు. ''మహాత్మా.. మాలో నిర్వీర్యమైన చైతన్యాన్ని పునరుజ్జీవింపజేస్తాం.. మాలో ఆరిపోయిన ఉద్యమ జ్వాలను తిరిగి రగిలిస్తాం..'' అంటూ, ఆయన ప్రతిమ సాక్షిగా ప్రతిన బూనారు. **– నమస్తే నెట్‌వర్క్**

బూర్గంపహాడ్ : సారపాకలో బీఆర్ఎస్ నాయకులు.

అశ్వాపురం మండలంలో..

మణుగూరు టౌన్ : బీఆర్ఎస్ కార్యాలయంలో,

భద్రాచలంలో..

కరకగూడెంలో..

దుమ్ముగూడెంలో..

పినపాకలో..

పాల్వంచలో..

లక్ష్మీదేవిపల్లిలో..

అన్నపురెడ్డిపల్ల మండలంలో..

చండ్రుగొండలో..

అశ్వారావుపేట పట్టణంలో..

అశ్వారావుపేటలో..


ఇల్లెందులో.. మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లిలో..

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

చుంచుపల్లి, జనవరి 30: చెక్ బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుచరిత గురువారం తీర్పు చెప్పారు. రామవరానికి చెందిన కంభంపాటి కోటేశ్వరరావు వద్ద 2018 ఏప్రిల్ 22న సన్యాసిబస్తీకి చెందిన కొడాలి నరసింహారావు రూ.5లక్షలు అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోటు రాయించి ఇచ్చాడు. డబ్బులు ఎన్నిసార్లు డిమాండ్ చేసినప్పటికీ చెల్లించలేదు. చివరకు, 2019 ఏప్రిల్ 15న కొడాలి నరసింహారావు నాలుగురన్న లక్షలకు చెక్కు ఇచ్చాడు. ఖాతాలో సరిపడినంత నగదు లేకపోవడంతో అది బౌన్స్ అయింది. దీంతో, కంభంపాటి కోటేశ్వరరావు తన లాయర్ ద్వారా కొడాలి నరసింహారావుకు నోటీస్ పంపారు. దానికి అతడు స్పందించలేదు. దీంతో, కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదును కంభంపాటి కోటేశ్వరరావు దాఖలు చేశారు. కొడాలి నరసింహారావుపై నేరం రుజువవడంతో అతడిది ఏడాది జైలు శిక్ష విధిస్తూ, కోటేశ్వరరావుకు నష్ట పరిహారంగా ఐదు లక్షల రూపాయలు చెల్లించాలని పేర్కొంటూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఫిర్యాదుదారు కంభంపాటి కోటేశ్వరరావు తరపున న్యాయవాదులు జీవీ ప్రసాద్, జియాహుల్ హస్సన్, సవిత వాదించారు.

రుద్రంపూర్ పాఠశాలలో వైద్య శిబిరం

రామవరం, జనవరి 30: సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వైద్య శిబిరాన్ని కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రి సీఎంవో డాక్టర్ సుజాత నిర్వహించారు. ఏరియా జీఎం శాలెంరాజు, డీజీఎం శివకేశవరావు, రుద్రంపూర్ డాక్టర్ పరశురాములు, డెర్మటాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్, హెచ్‌వో లలిత, సీనియర్ పీవో మజ్జి మురళి, హెచ్ఎం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

మణుగూరు టౌన్, జనవరి 30: జిల్లా స్థాయి ఆక్షన్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం నుంచి మణుగూరు స్టోర్ గ్రౌండ్ వద్ద నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఉమా మాస్టర్, బేతమళ్ల శశికిరణ్, రంజిత్ డెకరేషన్, నాగరాజు, సతీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం 9949100250, 7780528516 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

మూడు ఇసుక లారీలు పట్టివేత

గుండాల, జనవరి 30: మండల పరిధిలోని ముత్తాపురంలో గ్రామం నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కిన్నెరసాని నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండగా మూడు లారీలను అదుపులో తీసుకున్నట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చారించారు. పట్టుకున్న లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

టేకులపల్లికి త్వరలోనే మిర్చి కొనుగోలు కేంద్రం

టేకులపల్లి, జనవరి 30: టేకులపల్లి మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని తర్వలోనే ప్రారంభిస్తామని ఇల్లెందు మార్కెట్ యార్డు గ్రేడ్-3 కార్యదర్శి నరేష్‌కుమార్ తెలిపారు. మిర్చి అమ్మకాలపై వారు బుధవారం టేకులపల్లిలో మిర్చి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలో అధిక మొత్తంలో మిర్చి సాగవుతున్నందున త్వరలోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు.

టీఎస్ టీటీఎఫ్ కమిటీ ఎన్నిక

చండ్రుగొండ, జనవరి 30: టీఎస్ టీటీఎఫ్ మండల నూతన కమిటీని గురువారం గానుగపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా వాంకుడోతు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా భూక్య రవి, కోశాధికారిగా బానోత్ భద్రు, ఉపాధ్యక్షులుగా బానోత్ అంబాజీరావు, బదావత్ రవీందర్, కార్యదర్శులుగా భూక్య శ్రీను, ఇస్లావత్ రమేష్, జర్పుల రాందాసు, గౌరవాధ్యక్షుడిగా లకావత్ సూర్యం, మహిళా విభాగం అధ్యక్షరాలిగా ధరావత్ భారతి, కార్యదర్శిగా బానోత్ సునీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రాములు నాయక్, జిల్లా అధ్యక్షుడు భూక్యా మోహన్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ చౌహాన్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యమివ్వాలి

అశ్వారావుపేట (ములకలపల్లి), జనవరి 30: ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో పంచాయతీ కార్మికులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీ కార్మికుల జేఏసీ నాయకులు గురువారం ఎంపీడీవో రేవతికి వినతిపత్రం ఇచ్చారు. గ్రామ పంచాయతీ కార్మికులంతా నిరుపేదలేనని చెప్పారు. గంటా శ్రీనివాసరావు, చిక్కుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం

ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో

లక్ష్మీదేవిపల్లి, జనవరి 30: కుష్ఠు వ్యాధిపై అందరికీ అవగాహన అవసరమని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ అన్నారు. గాంధీ వర్ధంతి, యాంటీ లెప్రసీ డే సందర్భంగా హేమచంద్రాపురం పంచాయతీలోని లెప్రసీ కాలనీలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్ఠు వ్యాధిపై పోరాడతామంటూ కాలనీ వాసులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏవో డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ హరిష, సంధ్య, భద్రు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి, జనవరి 30: కుష్ఠు వ్యాధిపై స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక బుధవారం అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది వెంకటేశ్వరరావు, ప్రేమలత, జ్యోతి పాల్గొన్నారు.

విగ్రహాలకు ముసుగులు

అశ్వారావుపేట, జనవరి 30: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. పట్టణంలోని రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఫ్లెక్సీలను తొలగించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ నాయకులు తమ సభలకు, సమావేశాలకు, ప్రచారానికి అనుమతి తీసుకోవాలని కమిషనర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు.

తోట రమేష్‌కు నివాళి

ఇల్లెందు, జనవరి 30: ఇల్లెందు మున్సిపాలిటీ ఆరో వార్డు బీఆర్ఎస్ నాయకుడు తోట రమేష్ ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబీకులను ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ గురువారం వేర్వేరుగా పరామర్శించారు. చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకుడు దిండిగాల రాజేందర్, వివిధ పార్టీల నాయకులు జాని, జెకె.శ్రీను, కటకం పద్మ, ఎలమద్ది రవి, అజ్మీర భావ్ సింగ్, లాల్‌చంద్ పాల్గొన్నారు.

బొల్లం వెంకటేశ్వర్లుకు సన్మానం

సన్మానిస్తున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు రూరల్, జనవరి 30: ఇల్లెందు ఏరియా ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ చేశారు. జీఎం కార్యాలయంలో వెంకటేశ్వర్లు దంపతులను గురువారం ఏరియా జీఎం కృష్ణయ్య సన్మానించారు. అధికారులు నరసింహరాజు, శివ ప్రసాద్, నాయకులు సారయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఇల్లెందు రూరల్, జనవరి 30: ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని ఇప్టూ నాయకుడు కొక్కు సారంగపాణి గురువారం పరామర్శించి, రూ.10 వేలు అందించారు. నాయకులు సీతారామయ్య, ప్రసాద్, తోడేటి నాగేశ్వరరావు, తొగర సామేల్, మోహన్‌రావు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు ఇవ్వాలని వినతి

టేకులపల్లి, జనవరి 30: మూడు నెలల వేతన బకాయిలు ఇవ్వాలని కోరుతూ ఉపాధి హామీ సిబ్బంది బుధవారం ఎంపీడీవో రవీందర్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. ఏపీవో శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య పాల్గొన్నారు.

వైద్య సేవలపై కేంద్ర బృందం ఆరా

సేవల వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం

అశ్వారావుపేట (ములకలపల్లి), జనవరి 30: ములకలపల్లి మండలంలోని ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అందుతున్న సేవలపై కేంద్ర బృందం గురువారం వివరాలు సేకరించింది. మంగపేట పీహెచ్‌సీతోపాటు మూకమామిడి సబ్ సెంటర్‌ను కేంద్ర ప్రభుత్వానికి చెందిన పాపులేషన్ రీసెర్చ్ టీం గురువారం సందర్శించింది. ఆసుపత్రుల్లోని మౌళిక సదుపాయాలు, కావాల్సిన వసతులు, ఇతర సమస్యలను నమోదు చేసుకుంది. రోజువారీగా ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్యను డాక్టర్ సాయి కళ్యాణ్, డాక్టర్ కృష్ణ దీపక్ రెడ్డి నుంచి సేకరించింది. ఈ బృందంలో మురుగేశన్, సెంథిల్ ఉన్నారు. నాన్ కమ్యూనిటీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మధువరణ్, ఎన్‌హెచ్ఎం అకౌంటెంట్ భాను పాల్గొన్నారు.

పరధ్యానంతో డ్రైవింగ్.. ప్రమాదానికి దారి

మాట్లాడుతున్న ఎంవీఐ వెంకటపుల్లయ్య

భద్రాచలం, జనవరి 30: పరధ్యానంతో డ్రైవింగ్ చేస్తే ప్రమాదానికి కారణమవుతుందని భద్రాచలం ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. గురువారం యూనిట్ కార్యాలయంలో లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, మోటరు వెహికల్ రిజిస్ట్రేషన్, ఆటో రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్‌కు వచ్చిన వాహనదారులకు ఆయన రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు.

ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలి

టేకులపల్లి, జనవరి 30: ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం మండలంలోని మొక్కంపాడు తండా గ్రామంలో సమితి సమావేశంలో మాట్లాడారు. లంబాడీలు మాట్లాడే గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. నాయకులు జాటోత్ శ్రీనివాస్, మోహన్, రవి, రాంజీ, బాబురావు, భద్రు తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ, జనవరి 30: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోట్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఆయన గురువారం మండలంలోని వెంకటియాతండా పంచాయతీలో సమావేశంలో మాట్లాడారు. సేవాలాల్ మహరాజ్ జయంతి రోజైన ఫిబ్రవరి ఒకటో తేదీన సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు బాలాజీనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌నాయక్, నాయకులు భాస్కర్‌నాయక్, భూక్య చిన్నేష్, ధరావత్ శివ పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, జనవరి 30: భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్య బలిహరణ, నిత్యపూజలు జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేటర్ల అరెస్టును ఖండించిన రేగా

మణుగూరు టౌన్, జనవరి 30: జీహెచ్ఎంసీ పాలకమండలి సమావేశంలో హైదరాబాద్ నగరాన్ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టినందుకు కార్పొరేటర్లను అరెస్టు చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్ నగరానికి నిధులు ఇవ్వడం లేదని, కోటి మంది నగర ప్రజల తరపున ప్రశ్నిస్తే బయటికి గెంటేస్తారా అంటూ ప్రశ్నించారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా లాంటి కనీస ప్రజా అవసరాలను కూడా సరిగ్గా నిర్వహించలేని జీహెచ్ఎంసీ అసమర్థ తీరును ప్రశ్నిస్తే ప్రభుత్వం జీర్ణించుకోవడం లేదని, హైదరాబాద్ నగర ప్రజల సమగ్ర అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. అరెస్టు చేసిన కార్పొరేటర్లను వెంటనే విడుదల చేయాలని కోరారు.

ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం

మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరాచారి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 30: యుక్త వయసు పిల్లల్లో వచ్చే మార్పులపై వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయ కౌన్సిలర్లపై ఉందని డీఈవో వెంకటేశ్వరాచారి అన్నారు. జిల్లాలోని 126 ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు కెరీర్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పిల్లలు ఎక్కువ కాలం పాఠశాలల్లోనే గడుపుతుంటారని అన్నారు. వారికి ఉపాధ్యాయులే మార్గ నిర్దేశనం చేయాలన్నారు. జిల్లా సమన్వయకర్త నాగరాజశేఖర్, రిసోర్స్ పర్సన్స్ ఎం.ప్రభుదయాళ్, గోపీవరప్రసాద్, మీరా సాహెబ్, రవి ప్రతాప్, శ్యాంచందర్‌రావు పాల్గొన్నారు.

రోజువారీ పనులు ఆపొద్దు

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సుజాత

అశ్వారావుపేట టౌన్, జనవరి 30: మున్సిపల్ సిబ్బంది తమ రోజువారీ పనులు ఆపొద్దని, ఎప్పటిలాగానే కొనసాగించాలని అశ్వారావుపేట మున్సిపల్ కమిషనర్ కె.సుజాత అన్నారు. మున్సిపాలిటీలోకి చేరిన పేరాయగూడెం, గుర్రాలచెరువు పంచాయతీల్లో పారిశుధ్య పనులు, నీటి సరఫరా, పన్నుల వసూళ్లు పూర్వంలాగానే కొనసాగుతాయని చెప్పారు. ఆమె గురువారం స్థానిక పురపాలక శాఖ నూతన కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఇప్పటి వరకు ఉన్న పంచాయతీ కార్యదర్శులు.. గురువారం నుంచి వార్డు ఆఫీసర్లు విధులు నిర్వహిస్తారని చెప్పారు. భవన నిర్మాణ అనుమతులు, బర్త్-డెత్ సర్టిఫికెట్లకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసేందుకు కొంత సమయం పడుతుందని అన్నారు.

టీఆర్‌వీకేఎస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

పాల్వంచ, జనవరి 30: టీఆర్‌వీకేఎస్ డైరీ, క్యాలెండర్‌ను సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో గురువారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి ప్రకాష్, నాయకులు కోడూరి ప్రకాష్, కేవీ జాన్సన్, చారుగుండ్ల రమేష్, కరెంట్ రావు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఆళ్లపల్లి, జనవరి 30: మండలంలో విద్యుత్ లోడ్ పెరిగిందని, దానికి అనుగుణంగా మరో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించినట్లు సుపరింటెండెంట్ ఇంజినీర్ మహేందర్ గురువారం తెలిపారు. డీఈ రంగస్వామి, ఏడీఈ కోటేశ్వరరావు, సబ్ ఇంజినీర్ నజీర్, లైన్‌మెన్లు జగన్, శివ, పవన్ పాల్గొన్నారు.

మర్కోడు నుంచి రేగళ్ళ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ఆళ్లపల్లి, జనవరి 30: మండల పరిధిలోని మర్కోడు నుంచి రేగళ్ళ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మర్కోడు గ్రామంలో మండల అధ్యక్షుడు బొమ్మల కనకరాజు ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ అనుమతుల పేరిట రోడ్డు నిర్మాణం అపడం వల్ల గిరిజన ప్రజలు రవాణా సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం గిరిజనుల ఉమ్మడి హక్కులు కల్పించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కుష్ఠు నిర్మూలన కార్యక్రమం

చర్ల, జనవరి 30: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చర్ల (కొయ్యూరు) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం కుష్ఠు నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేగుంట పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కుష్ఠువ్యాధి లక్షణాలను పాఠశాల విద్యార్థులకు వివరించారు.

'హలో బీసీ.. ఛలో వరంగల్'ను జయప్రదం చేయండి

బూర్గంపహాడ్, జనవరి 30: రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు కదం తొక్కుతున్నారని.. బీసీలు సత్తా చాటే దిశగా 'హలో బీసీ.. ఛలో వరంగల్' పేరుతో ఫిబ్రవరి 2న వరంగల్‌లో లక్షలాది మంది బీసీలతో జరుగనున్న యుద్ధబేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మహంకాళి రామారావు గురువారం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బెజ్జంకి కనకాచారి, చీమలపాటి కోటేశ్వరరావు, నిదానలపల్లి బాలకృష్ణ, దాసరి సాంబ, మేకల నర్సింహారావు, చిప్పా రాజు పాల్గొన్నారు.

గోటి తలంబ్రాలు వలిచే కార్యక్రమం

బూర్గంపహాడ్, జనవరి 30: మండల పరిధిలోని సారపాకలో కొలువైన షిరిడీ పుష్కర ద్వారక సాయిబాబా మందిరంలో భద్రాద్రి రామయ్య కల్యాణానికి గోటి తలంబ్రాలు వలిచే కార్యక్రమాన్ని ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో మందిర కమిటీ సౌజన్యంతో గురువారం చేపట్టారు. మందడి హనుమంతరావు, సింగమనేని విజయ భాస్కరరావు, ఇండ్ల శ్రీనివాసరావు, అక్కర భాస్కరాచారి, కొత్తపల్లి సత్యనారాయణ, కృష్ణారావు, నాగేశ్వరరావు, రామకృష్ణ, రామ్మోహన్‌రెడ్డి, రమణమూర్తి, రాంబాబు, మేడూరి వెంకట సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ దినోత్సవం

కొత్తగూడెం సింగరేణి, జనవరి 30: కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో గురువారం ఉదయం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జీఎం (పర్సనల్) ఆర్‌సీ శ్రీనివాసరావు, జీఎం కవితా నాయుడు, జీఎం (ఫైనాన్స్) సుబ్బారావు నిర్వహించారు. అమరవీరులకు నివాళి అర్పించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎండీ బలరాం, డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భద్రాచలం డీటీగా వెంకటేశ్వర్లు

భద్రాచలం, జనవరి 30: భద్రాచలం డిప్యూటీ తహసీల్దార్‌గా ధనియాల వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయంలో గతంలో యూడీసీగా, కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి ప్రస్తుతం ఉద్యోగోన్నతిపై డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. వెంకటేశ్వర్లును కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

భద్రాచలం, జనవరి 30: భద్రాచలం డిపోలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ తిరుపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టీసీ సమస్యలకు సంబంధించి మాట్లాడాలనుకునే ప్రయాణీకులు 9959225960ను సంప్రదించాలని ఆయన కోరారు.